సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం : 26 : మే : 2023



పచ్చిరొట్టతో భూమికి సారం

పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై ఇస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నారు.

- 8లో



ఆధ్యాత్మిక శోభ..

పాతపట్నంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. పట్టణమంతా విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది.


- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్టం	కనిష్టం
ఆమదాలవలస	37°	25°
ఇచ్ఛాపురం	37°	27°
పాతపట్నం	38°	26°
శ్రీకాకుళం	37°	26°

న్యూస్‌రీల్

శరత్ బాబుకు సైకత నివాళి



శరత్‌బాబు సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ గురువారం శరత్‌బాబు సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. సినీ రంగంలో మంచి గుర్తింపు పొందిన నటుడు ఆమదాలవలస పట్టణానికి చెందిన వ్యక్తి కావడం ఎంతో గర్వకారణమని చెబుతూ నివాళులర్పించారు.

కలెక్టర్‌ను కలసిన ట్రైనీ కలెక్టర్



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ట్రైనీ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ట్రైనీ కలెక్టర్ రాఘువేంద్ర మీనా గురువారం మర్యాదపూర్వకంగా ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా తన రిపోర్ట్‌ను కలెక్టర్ లాఠకర్‌కు అందజేశారు.

తర్లికొండ పరిశీలన



తర్లికొండ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

కోటబొమ్మాళి: మండలం తర్లిపేట రెవెన్యూలోని సర్వే నంబర్ 36-1 స్థలాన్ని గురువారం టెక్కలి సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. 2016లో వేదవిద్యాలయానికి తర్లికొండపై 209.84 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. దీనిపై స్థానిక రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని ఆక్రమించి హద్దులు వేశారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సబ్‌కలెక్టర్ ఆ స్థలాన్ని పరిశీలించి రీ సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.మధును ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్, సర్పంచ్ బలగ సూర్యారావు, బి.ఎల్లయ్య, డివిజినల్ సర్వేయర్ ఎం.జనార్దనరావు, మండల సర్వేయరు అప్పలస్వామి, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్ఓ టి.రాము పాల్గొన్నారు.

'ప్లాంటేషన్ పనులపై నిర్లక్ష్యం వద్దు'




జీవీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్లాంటేషన్ పనులపై నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు సిబ్బందిపై అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. 12,320 మంది లబ్ధిదారులకు అటవీ ప్రాంతాల్లోని భూములకు పట్టాలు ఉన్నాయని, వీరికి ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చి భూమి అభివృద్ధి పనులు లేదా వ్యక్తిగత తోటల పెంపకం పనులకు తక్షణమే అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా రహదారుల పక్కన మొక్కల పెంపకం పనులకు మునగ, నర్సరీల ఏర్పాటు, మునగ తోటల పెంపకానికి కూడా ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. రోజుకు 2.70 లక్షల మందికి ఉపాధిని చూపించాలని ఇందులో విఫలమైతే సహించబోనన్నారు. అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు సోమవారం నుంచి ప్రత్యేక బృందాలు జిల్లాలో పర్యటిస్తాయని చెప్పారు. జాబ్ కార్డులతో ఆధార్ కార్డుల అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

టాప్ గేర్‌లో భూసర్వే

- రాష్ట్రంలో సిక్కోలు ఫస్ట్
- మిగతా జిల్లాలకు అందనంత వేగంగా ప్రక్రియ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లాలో భూ సమగ్ర సర్వే శరవేగంగా జరుగుతోంది. అటు భూ సర్వే, ఇటు సర్వే రాళ్ల ఏర్పాటు, భూ హక్కు పత్రాల పంపిణీలోనూ మన జిల్లా మొదటి స్థానంలో ఉంది. ముఖ్యంగా సర్వే రాళ్ల పాతడంలో మిగతా జిల్లాలకు అందనంత దూరంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమానికి సంబంధించి ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికార వర్గాలు ప్రశంసలు అందుకుంటున్నాయి. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా మంచి కార్యక్రమానికి ప్రభుత్వం ముందడుగు వేసింది. గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం అమల్లోకి తెచ్చింది. దేశంలో తొలిసారిగా అత్యంత శాస్త్రీయ పద్ధతిలో సమగ్ర భూసర్వే చేస్తోంది. ప్రస్తుతం భూముల రీ సర్వే జోరుగా సాగుతోంది. తొలి విడత 354గ్రామాల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పూర్తి చేయగా, రెండో విడత 195 గ్రామాల లక్ష్యంలో సగం గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ఇప్పటి వరకు 496 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసుకుని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది. డ్రోన్ల సర్వే అయితే లక్ష్యానికి మించి 888 గ్రామాల్లో పూర్తయింది. చెప్పాలంటే అదనంగా 392 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేసి మన జిల్లా రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచింది.

అక్రమాలకు చెక్

- గ్రామాల సరిహద్దు నుంచి భూముల వరకు ప్రతి అంగుళం విడిచిపెట్టకుండా సర్వే చేస్తుండటం వల్ల ఎన్నో వివాదాలకు చెక్ పడుతోంది.
- కొందరికి తప్పులతో తలెత్తిన సమస్యలు సర్వేతో పరిష్కారమవుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- భూ సర్వేలో డ్రోన్‌ల సాయంతో ఫొటోలు తీయడం మొదలుకొని, మ్యాపింగ్ వరకూ అన్ని వివరాలూ ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయి.
- రికార్డులు చెరిపేయడానికి, టాంపరింగ్ చేయడానికి ఆస్కారం లేని విధంగా సర్వే కొనసాగుతోంది.
- ఇప్పటివరకు సబ్ డివిజన్ల వల్ల అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.
- రీ సర్వేలో సబ్ డివిజన్ల వ్యవస్థను తీసేసి ఎల్‌పీఎం సిస్టమ్ పెట్టారు.
- ఇకపై సర్వే నంబర్ 1, సర్వే నంబర్ 2 ఇలా ఒకే నంబర్‌తో భూములుంటాయి.
- రీ సర్వే చేస్తున్న సమయంలోనే ఊరు, సచివాలయం పరిధి, మండలం వంటివన్నీ రికార్డు చేస్తున్నారు. దీంతో భూవివాదాలకు తావుండదు.



కంచిలిలో ఇటీవల సర్వే రాళ్ల ఏర్పాటుపై సూచనలు చేస్తున్న జేసీ నవీన్

- భూముల క్రయవిక్రయాలు జరగకపోతే ఎన్నేళ్ల తర్వాతైనా ఒకే యజమాని పేరు మీద ఉండేలా రికార్డులు రూపు దిద్దుకుంటున్నాయి.

పద్ధతి ప్రకారంగా..



పొలాల్లో సర్వేకు వినియోగిస్తున్న డ్రోన్లు

- తొలుత గ్రామాల్లో డ్రోన్లు ఎగర వేసి భూములను క్యాప్చర్ చేస్తున్నారు.
- ఈ ప్రక్రియలో భూముల కొలతలు తీస్తారు. ఆటోమెటిక్‌గా ఆన్‌లైన్‌లో రికార్డయ్యి శాటిలైట్ సాయంతో డ్రోన్ తీసిన పటాలు (చిత్రాలు)(ఓఆర్ఐ షీట్లు) వస్తున్నాయి.
- వచ్చిన ఓఆర్ఐ షీట్లు ఆధారంగా క్షేత్రస్థాయిలో భౌతికంగా సర్వే చేస్తున్నారు.
- ఆ తర్వాత భూముల, స్థలాల యజమానులకు నోటీసులు ఇస్తున్నారు.
- ఓఆర్ఐ షీట్లలో నమోదైన విస్తీర్ణానికి, ప్రస్తుతం ఉన్న కొలతలకు వ్యత్యాసం ఉందో లేదో చూస్తున్నారు. ఒకవేళ తేడా ఉంటే అభ్యంతరాలు స్వీకరించి సరిచేస్తున్నారు.
- ఈ క్రమంలో ఏమైనా తప్పులు కనిపించినా, లోపాలు ఉన్నా సరి చేస్తున్నారు.
- భూ యజమానుల అంగీకారంతో ఏ సర్వే నంబర్ వారికి చెందిందో అదే సర్వే నంబర్‌లో భూమి వారికి చూపుతున్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటులో రికార్డు..



- తొలి విడతలోని సర్వే పూర్తయిన 354 గ్రామాల్లో 4,46,316 సర్వే రాళ్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా ఆ మేరకు 100 శాతం పూర్తి చేశారు.
- రెండో విడతలో 127 గ్రామాల్లో లక్షా 67వేల 238 సర్వే రాళ్లను జూన్ 30వ తేదీలోగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.
- రాష్ట్రంలో ఏ జిల్లాలో కూడా ఈ స్థాయిలో సర్వే రాళ్ల ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. పెద్ద జిల్లాల్లో కూడా ఈ రకమైన ప్రగతి లేదు. మన జిల్లాలోనే సర్వే రాళ్ల ఏర్పాటు వేగంగా జరుగుతోంది.

భూ హక్కు పత్రాల పంపిణీలోనూ..



రీ సర్వే పూర్తయిన తర్వాత రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిస్తున్నారు. జిల్లాలో తొలి విడత రీసర్వే పూర్తయిన గ్రామాల భూములకు సంబంధించి ఇప్పటికే పత్రాలు పంపిణీ చేశారు. రెండో విడతలో సర్వే చేసిన గ్రామాలకు హక్కు పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమం జరుగుతోంది. ఇప్పటివరకు రెండు విడతల్లో 496 గ్రామాల్లో సర్వే పూర్తవ్వగా 380 గ్రామాలకు సంబంధించి భూ హక్కు పత్రాలు జిల్లాకు చేరాయి. లక్షా 20వేల 921ఖాతాలకు సంబంధించి లక్షా 14వేల 469 పత్రాలు వచ్చాయి. వీటిలో ఇప్పటికి లక్షా 11వేల 523భూ హక్కు పత్రాలు పంపిణీ జరిగింది. ఇంకా 2,946భూ హక్కు పత్రాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. జిల్లాకొచ్చిన పత్రాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? సరిచూసుకుని పంపిణీ చేస్తున్నారు. ప్రతి యజమానికి ల్యాండ్ టైటలింగ్ కార్డు అందిస్తున్నారు. ఆస్తి విస్తీర్ణం, కొలతలు, యజమానికి సంబంధించిన వివరాలతో పాటు ఫొటో క్యూఆర్ కార్డులో పొందుపరిచి ఉన్నాయి. దీన్ని స్కాన్ చేయగానే భూమి వివరాలన్నీ కనిపిస్తాయి. బార్‌కోడ్‌లో ఎవరి వివరాలు కనిపిస్తాయో వాళ్లే యజమాని. నకిలీ పాసు బుక్‌లు సృష్టించే అవకాశం ఉండదు. హక్కుదారులు ఎక్కడున్నా భయపడాల్సిన పని ఉండదు.

జిల్లాలో ఉన్న గ్రామాలు	1466
వ్యవసాయ భూములు	9,86,092.82 ఎకరాలు
సర్వే నంబర్లు	2,42,283
సబ్ డివిజన్లు	20,02,700
బేస్ స్టేషన్లు	4
భూ సర్వేకు వినియోగిస్తున్న డ్రోన్లు	3
రోవర్లు	142
భూ సర్వేలో పాల్గొంటున్న సర్వేయర్లు	615
రెవెన్యూ గ్రామ కార్యదర్శులు	844
జిల్లా మొత్తం నియమించిన గ్రామ సర్వే బృందాలు	545
జిల్లాలో ఇప్పటివరకు సర్వే ప్రారంభించిన గ్రామాలు	888
డ్రోన్ సర్వే చేసిన గ్రామాలు	888
డ్రోన్ సర్వే పూర్తయిన విస్తీర్ణం	5,21,503 ఎకరాలు
డ్రోన్లు ఎగరవేశాక పటాలు (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్) విడుదలైన గ్రామాలు	624
వాస్తవ భూ నిర్ధారణ జరిగిన గ్రామాలు(గ్రౌండ్ ట్రూతింగ్)	580

సర్వేలో ముందున్నాం

సమగ్ర భూ రీసర్వేలో మన జిల్లా ముందంజలో ఉంది. రెవెన్యూ, సర్వే యంత్రాంగం ప్రత్యేక దృష్టితో సర్వే నిర్వహిస్తోంది. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పర్యవేక్షణ, ఆదేశాల మేరకు సర్వే శరవేగంగా చేస్తున్నాం. సర్వేలోనే కాకుండా సర్వే రాళ్లను ఏర్పాటు చేయడంలోనూ అగ్రస్థానంలో ఉన్నాం. ప్రభుత్వ లక్ష్యాలు, గడువు మేరకు సర్వే ప్రక్రియ పూర్తి చేసే పనిలో ఉన్నాం.

– ప్రభాకర్, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే శాఖ, శ్రీకాకుళం



సర్వే జరిగిందిలా...

రీ సర్వే పూర్తి చేసుకున్న గ్రామాలు	రీ సర్వే పూర్తి చేసుకున్న విస్తీర్ణం	భూ హక్కు పత్రాలు తయారైన గ్రామాలు	380 గ్రామాల్లో ఉన్న ఖాతాదారులు	ప్రభుత్వం నుంచి వచ్చిన భూ హక్కు పత్రాలు	ఇప్పటివరకు పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలు	పంపిణీ చేయాల్సి ఉన్న భూహక్కు పత్రాలు
496	2,10,275.53 ఎకరాలు	380	1,20,921	1,14,469	1,11,523	2,946

తెలంగాణ ఎంసెట్‌లో సిక్కోలు పాగా

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు విద్యార్థులు తెలంగాణ ఎంసెట్‌లోనూ పాగా వేశారు. తాజాగా విడుదలైన తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో అటు ఇంజినీరింగ్, ఇటు అగ్రికల్చర్ అండ్ మెడిసిన్ విభాగాల్లో విజయబావుటా ఎగుర వేశారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకుతోపాటు 5, 8 వంటి ర్యాంకులతో 10లోపు పలు ర్యాంకులు సాధించి శభాష్ అనిపించారు. నందిగాం మండలం ధిమిలాడకు చెందిన సనపల అనిరుధ్ ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ సాధించాడు. అదే విభాగంలో శ్రీకాకుళం నగరంలోని అరసవల్లికి చెందిన బోయిన సంజన 8వ ర్యాంకు సాధించింది. అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో జిల్లాలోని పోలాకి మండలం గొల్లవలస పరిధిలోని తోటాడ గ్రామానికి చెందిన చెందిన బోర వరుణ్ చక్రవర్తి 5వ ర్యాంకుతో సత్తా చాటాడు.

354, 612 ర్యాంకులు

నరసన్నపేట,టెక్కలి: మండలంలోని బాడాం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న తర్ర వెంకటరమణమూర్తి కుమారుడు తర్ర సాయి చరణ్ తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ఇంజినీరింగ్ విభాగంగా 354వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. జేఈఈ మెయిన్స్‌లో 2629 వ ర్యాంకు సాధించాడు. కలెక్టర్ కావడం తన కుమారుడి ఆశయమని తండ్రి తెలిపారు. అలాగే టెక్కలి మండలం పాతనౌపడ పంచాయతీ జెండాపేట గ్రామానికి చెందిన తిప్పాన లిఖితారెడ్డి 612వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు తల్లిదండ్రులు హరిరెడ్డి, పద్మావతి తదితరులు వివరాలు వెల్లడించారు. ఎంసెట్ ఫలితాల్లో 119.95 మార్కులతో 612 ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు.



తిప్పాన లిఖితారెడ్డి



సాయి చరణ్

ఖరీఫ్‌కు రాయితీపై విత్తనాల పంపిణీ



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో రైతులకు ఖరీఫ్ పంటలకు విత్తనాలు రాయితీపై అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో డి-క్రిష్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు చెల్లించి రాయితీపై విత్తనాలు పొందాలని కోరారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ మండలాల్లో మందస, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం మండలాల్లో 90శాతం రాయితీపై విత్తనాలు అందించనున్నట్లు తెలిపారు.

విత్తనం రకం	ధర (రూ.)	సబ్సిడీ (రూ.)	రైతు చెల్లించాల్సింది(రూ.)
సోనామసూరి	1119	300	819
మారుటేరు సాంబ	1119	300	819
శ్రీకాకుళం సన్నాలు	1134	300	834
స్వర్ణ	1143	300	843
అమర	1143	300	843
ఇంద్ర	1143	300	843
శ్రీధృతి	1134	300	834
సాంబ	948	250	698

పచ్చిరొట్ట విత్తనాలు..

పంటవిత్తనం	పూర్తిధర (రూ.)	సబ్సిడీ (10కేజీలకు)(రూ.)	రైతు చెల్లించాల్సింది(రూ.)
జీలుగ	790	395	395
కట్టెజనుము	790	420	420
పిల్లిపెసర	776	388	388



రోజులు మారాయి..



కార్పొరేట్ కాలేజీల ప్రకటనలు చూసి ప్రభుత్వ కాలేజీలు ఆశ్చర్యపోయే రోజులు పోయాయి. ఇప్పుడు సర్కారు కాలేజీల ప్రకటనలను ప్రైవేటు కాలేజీలు నిభిడాశ్చర్యంతో చూసే మంచి రోజులు వచ్చాయి. ఇక్కడ కనిపిస్తున్న కరపత్రం సాక్షాత్తు పలాస ప్రభుత్వ డిగ్రీ కాలేజీది. వైఎస్ జగన్ సర్కారు వచ్చాక పలాసకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక్కడ అడ్మిషన్ల కోసం కాలేజీ వారు ఇలా కార్పొరేట్ స్టైల్‌లో ప్రచారం చేస్తున్నారు. –కాశీబుగ్గ

ఆక్రమణలపై కొరడా

- 'సాక్షి' కథనాలపై స్పందించిన అధికారగణం
- రహదారులు, ఇతరత్రా నిర్మాణాల ధ్వంసం
- కలెక్టర్, జేసీ ఆదేశాలతో చర్యలు: తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్...

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పాత్రునివలస భూకబ్జాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. సాక్షిలో 'బరి తెగించి మరీ-అక్రమానికి దారి' శీర్షికన వచ్చిన ప్రత్యేక కథనంపై జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ నవీన్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం తహసీల్దార్ వెంకటరావు పర్యవేక్షణంలో మండలంలోని పలువురు వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సర్వే చేసి ఆక్రమణలో ఉన్న రోడ్లు, ఇతరత్రా నిర్మాణాలను ప్రొక్లెయినర్ సాయంతో ధ్వంసం చేశారు. ముందుగా సర్వే నంబర్ 171/1లో ఎకరా 20సెంట్లు ఆక్రమణకు గురైందని గుర్తించి, అందులో నిర్మించిన రోడ్లు, ఇతరత్రా మార్కింగ్‌లను పెకిలించేశారు. గతంలో ఉన్న బ్యానర్లను తొలగించిన కబ్జాదారుల ఆగడాలకు చెక్ పెడతామని, ఈ సారి తొలగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ మరోసారి ఆక్రమణ స్థలంలో కొత్తగా బ్యానర్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పోరంబోకు భూమి ఆక్రమణదారులు శిక్షార్హులు అని ఆ బ్యానర్‌లో పేర్కొన్నారు.

మిగతావాటి సంగతేంటి?

అధికారులు స్పందిస్తూ సర్వే నంబర్ 171/1లోని ఎకరా 20సెంట్లు ఆక్రమణకు గురైందని గుర్తించి అందులో ఉన్న నిర్మాణాలను ధ్వంసం చేశారు. కానీ, సర్వే నంబర్ 161/3లో ఉన్న ఆక్రమణల జోలికి ఇంకా వెళ్లలేదు. అందులో కూడా ఆక్రమణ జరిగిందని, ఎకరా 18 సెంట్లు ల్యాండ్ సీలింగ్ భూమి కబ్జా చేయడంపై గతంలో ఇదే రెవెన్యూ సిబ్బంది బ్యానర్ ఏర్పాటు చేసింది. కానీ, ఆక్రమణదారులు దౌర్జన్యంగా వ్యవహరించి, ఆ బ్యానర్‌ను కూడా ఇటీవల తొలగించారు. ఈ లెక్కన అది అక్రమమని తెలిసినా కూడా ఈసారి ఎందుకో ఆ సర్వే నంబర్ వైపు వెళ్లి అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోలేదు. ఇదేంటని అడిగితే గతంలో పట్టాలు ఇచ్చారన్న వారి దగ్గరి నుంచి వివరాలు తీసుకుని, కార్యాలయంలో ఉన్న రికార్డులతో సరిపోల్చి తేడా లుంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటరావు చెబుతున్నారు. మరి, 161/3 సర్వే నెంబర్లలో జరిగిన ఆక్రమణలపై ముందు ఎలా చర్యలు తీసుకుంటారో చూడాలి.



పాత్రునివలస సర్వే నెంబర్. 171/1లో గల ఆక్రమణ భూమిలోని నిర్మాణాలను ప్రొక్లైనర్‌తో ధ్వంసం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



'ప్రభుత్వ పోరంబోకు భూమి'ని ఆక్రమిస్తే శిక్షార్హులు అని బ్యానర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఎనిమిది మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన ఎనిమిది మంది ఎస్‌ఐలకు బదిలీ చేస్తున్నట్లు విశాఖ రేంజి కార్యాలయం నుంచి శ్రీకాకుళం జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయానికి గురువారం ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో భాగంగా బారువ పీఎస్ నుంచి పోలాకి పీఎస్‌కు ఎస్ఐ వి.సత్యనారాయణ బదిలీ కాగా కంచిలి పీఎస్ నుంచి ఎస్.చిరంజీవి బారువ పీఎస్‌కు, సోంపేట పీఎస్ నుంచి ఎస్.బాలరాజు కంచిలి పీఎస్‌కు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం వీఆర్ నుంచి పాతపట్నానికి జి.ప్రభాకరరావు బదిలీ కాగా పాతపట్నం పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్.కామేశ్వరరావు గార పీఎస్‌కు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్‌లో ఎస్‌గా ఉన్న ఎస్.లక్ష్మణరావు శ్రీకాకుళం టూటౌన్ పీఎస్‌కు, శ్రీకాకుళం వీఆర్‌లో ఉంటూ ఇచ్ఛాపురం రూరల్ పీఎస్‌కు అటాచ్డ్‌గా ఉన్న వి.రమేష్‌ను ఇచ్ఛాపురం రూరల్ పీఎస్‌కు, శ్రీకాకుళం దిశా పీఎస్‌కు అటాచ్డ్‌గా ఉన్న బి.హైమావతిని సోంపేట పీఎస్‌కు ఎస్‌ఐలుగా బదిలీ చేస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

28.24 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో దొరికిన వ్యక్తులు

జలుమూరు: శ్రీముఖలింగం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 28.24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేర కు.. శ్రీముఖలింగం ఒరియా వీధిలో దుర్గా ప్రసాద్ దాస్,పద్మావతి దాస్, రాజ్ కుమార్ దాస్‌లు అక్రమంగా గంజాయి నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడి చేశారు. విక్రయిస్తున్న వీరితో పాటు గంజాయి కొనుగోలు చేస్తోన్న హిరమండలం, నరసన్నపేటకు చెందిన పన్నీరు ఖుషి కుమార్, దిబారిక్ రోహిత్, గొర్లె సాయి ప్రకాశ్‌లను అరెస్టు చేశారు. వీరికి ఒడిశా రాష్ట్రానికి చెందిన బృందావత్ రాళో అనే మహిళ సరుకు విక్రయించినట్లు గుర్తించారు. వీరిని కోటబొమ్మాళి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

రైళ్లు ఆలస్యం

టెక్కలి రూరల్: ఒడిశాలోని ఛత్రపూర్-గంజాం రైల్వేస్టేషన్ మధ్య గురువారం గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. నౌపడ రైల్వే స్టేషన్‌లో తిరుపతి-పూరీ ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు గంటపాటు నిలిచిపోయింది. భువనేశ్వర్-బెంగళూర్ నౌపడ రైల్వే స్టేషన్‌కు గురువారం 3 గంటలు ఆలస్యంగా వచ్చిందని స్టేషన్ మాస్టర్ తెలిపారు. అలాగే విశాఖ ఎక్స్‌ప్రెస్, రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైళ్లు సైతం ఆలస్యంగా వచ్చినట్లు తెలిపారు.

క్లుప్తంగా

3న జాబ్ ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వాయిదా పడిన పోస్టులకు జూన్ 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బీసీడీఈ కో–ఆర్డినేటర్ పోస్టులకు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు బీఆర్ఏయూ.ఈడీయూ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రక్తదాతలకు ప్రశంసలు



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీఈవో

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా రక్తనిధి కేంద్రంలో రక్తం కొరత ఉందని, ఈ నేపథ్యంలో త్వరలో విద్యాశాఖ ద్వారా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య అన్నారు. స్థానిక రక్తనిధి కేంద్రంలో గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 12 మంది రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, బి.చిన్నయరావు, పి.చైతన్యకుమార్, ఎ.నరసింగరావు, ఎ.బేగం, చేయి చేయి కలుపు సంస్థ ప్రతినిధులు వినోద్‌కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షునిగా పలిశెట్టి



పలిశెట్టి దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా పలిశెట్టి దామోదరరావు (శ్రీకాకుళం) నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జరిగాయి. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా ఓబులేసు, ముఖ్య సలహాదారుగా కటకం పద్మాకర్, ఉపాధ్యక్షులుగా పి.సత్యన్నారాయణ (విజయనగరం), రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పి.భానుమూర్తి (విజయనగరం), రాష్ట్ర కార్యదర్శులుగా చింతాడ వెంకటరావు (శ్రీకాకుళం), ఎస్.రామారావు (విశాఖపట్టణం), పి.నానాజీ (శ్రీకాకుళం)లు ఏకగ్రీవంగా విజయనగరం జోన్ నుంచి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గం రాష్ట్ర నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ శర్మ, జిల్లా కార్యదర్శి కొర్లాం గణేశ్వరరావు, అధ్యక్షులు ఆర్‌పి రావు, జిల్లా కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన సవర చిరంజీవి

మెళియాపుట్టి: స్కూటీ అదుపు తప్పడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సవర జాడుపల్లికి చెందిన సవర చిరంజీవి, సవర ఢిల్లేశ్వరరావులు వ్యక్తిగత పనిపై జాడుపల్లి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెస్తుండగా మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో చిరంజీవి తలకు బలమైన గాయంకాగా, వెనుకనున్న ఢిల్లేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,360–00
బంగారం(22సి. 10గ్రా.)	56,250–00
వెండి (కిలో)	77,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పచ్చిరొట్టతో భూమికి సారం

- ఆర్‌బీకేలా ద్వారా సబ్సిడీపై విత్తనాల సరఫరా
- అందుబాటులో 2281 క్వింటాళ్ల విత్తనాలు



రామచంద్రాపురంలో సాగు చేసిన పచ్చిరొట్ట

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ముందుగా భూసారాన్ని పెంచుకోవడంపై దృష్టిసారిస్తున్నారు. భూమికి బలాన్ని చేకూర్చే పచ్చిరొట్ట ఎరువైన జీలుగ పంటను సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. గురువారం నుంచి రోహిణి కార్తె ఆరంభం అవుతుంది. ఈ సీజన్‌లో పచ్చిరొట్ట సాగుకు అనువైన సమయంగా రైతులు భావిస్తారు. సన్న రకం వరి పండించే వారు ఇప్పటి నుంచే జీలుగ విత్తుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని 30 మండలాల పరిధిలో 656 రైతు భరోసా కేంద్రాల్లో 2,281 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచారు.

భూమి సారవంతం

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా మారుతుంది. సేంద్రీయ, రసాయన ఎరువులు వేసే అవసరం తగ్గుతుంది. భూసారం తగ్గి, పంట దిగుబడిపై ప్రభావం పడుతుండటంతో అప్రమత్తమైన అధికారులు మూడేళ్లుగా జీలుగ సాగుపై ప్రత్యేక దృష్టిసారించారు. రైతులకు అవగాహన కల్పించడంలో సఫలీకృతమవుతున్నారు. ఇప్పుడు జిల్లాలో జీలుగ, పిల్లిపెసర, కట్టె జనుము సాగు చేయడానికి అన్నదాతలు ముందుకు వస్తున్నారు. వరి ఎదసాగు చేసే రైతులు తక్కువగా వీటిపై ఆసక్తి చూపుతున్నారు. దమ్ముపట్టి వరినారు వేసే రైతులు పచ్చిరొట్టను సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నారు. పది కిలోల జీలుగు విత్తనాలు రూ. 395, ఎనిమిది కిలోల పిల్లి పెసర రూ. 485, పది కేజీల కట్టె జనుము 420 రూపాయలుగా ధరలు నిర్ణయించి సబ్సిడీపై విక్రయాలు చేస్తున్నారు. వరి పంటను సాగు చేసే నెల రోజుల ముందే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు జల్లుకోవాలి. ఎకరాకు పది కిలోల పచ్చిరొట్ట విత్తనాలు అవసరం. వరినారు పోసే పది రోజుల ముందు నుంచే భూమిని కలియదున్నితే పైరు భూమిలో మునిగి భూసారం పెరుగుతుంది. నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తిని పెంచుతుంది. తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను నివారించగలుగుతుంది.

కుళ్లిన తరువాత నాట్లు వేయాలి

పచ్చిరొట్ట ఎరువు తేలికపాటి నేలల్లోనూ, ఇసుక, చౌడు భూముల్లోనూ సాగు చేసుకోవచ్చు. చౌడు భూముల్లో ఉన్న లవణాలను తీసివేసి, మంచి భూమిగా తయారు చేయడంలో పచ్చిరొట్ట ఎరువు ఎంతగానో దోహదపడుతుంది. దీనినుంచి ఎకరాకు ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తి అవుతుంది. 35 నుంచి 45 రోజుల మధ్యలో భూమిలో కలియదున్నితే మంచిది. ఇందులో 8 కిలోల భాస్వరం, 20 కిలోల పోటాష్, 35 కిలోల నత్రజని ఉంటుంది. పిల్లి పెసర పచ్చిరొట్టగా, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. పచ్చి రొట్టను పొలంలో కలియదున్నితే కుళ్లిన తరువాత నాట్లు వేసుకోవాలి.

సాగుకు రైతుల ఆసక్తి



గతంతో పోలిస్తే పచ్చిరొట్ట ఎరువు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించడం వలన మరింతగా ఉపయోగపడుతుంది. మోటార్లు, చెరువుల ఆధారం ఉన్న రైతులు ఇప్పుడు ఈ విత్తనాలను సాగు చేసుకోవచ్చును. నీటి వసతి లేని వారు వర్షాలు పడిన తరువాత వేసుకుంటే మంచిది. పచ్చిరొట్ట ఎరువు సాగు, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మెట్ట మోహనరావు, వ్యవసాయాధికారి, ఆమదాలవలస మండలం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి అగ్రపీఠం వేస్తున్నారని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సరుబుజ్జిలి మండలం మతలబుపేట పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం పలు సమస్యలను స్థానికులు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, సచివాలయం కో–ఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్, సర్పంచ్ వీరఘట్టపు జయలక్ష్మి, పార్టీ నేతలు సనపల తవుడు, వీరఘట్టపు కృష్ణ, తిరుపతిరావు, నాగేశ్వరరావు, ఎంపీడీఓ మురళీమోహనరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

డంపింగ్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి సమీపంలో గురువారం చెత్తను డంప్ చేసే మున్సిపాలిటీ వ్యాన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎస్ దొర తెలిపారు. రిమ్స్ పరిసర ప్రాంతాల్లో 45 నుంచి 50 ఏళ్లు నిండిన వ్యక్తి కొంతకాలంగా యాచక వృత్తి కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఏపీ30టీఏ3582 నంబరు గల డంపింగ్ వ్యాను ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు తెలిసిన వారు శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస స్టేషన్‌కు 089222306, 9440470450 నంబర్లకు తెలియజేయాలన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

వరకట్న వేధింపుల కేసులో వ్యక్తి అరెస్టు

పోలాకి: మండలంలోని పిరువాడకు చెందిన ఎన్ని రమేష్‌పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు. నిందితుడి భార్య ఢిల్లీశ్వరి నాలుగురోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం రమేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడికి రిమాండ్ విధించటంతో జిల్లా జైలుకు తరలించారు.

● ద్విశత దినోత్సవ సంబరం



ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి 200 రోజులకు చేరిన సందర్భంగా కంచిలిలో గురువారం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. –కంచిలి

వక్ఫ్ బోర్డు భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు



కవిటి ఎస్ఐకు ఫిర్యాదు అందిస్తున్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్‌సాధిక్ షేక్

కవిటి: మండలంలోని కవిటి, బెలగాం, కరాపాడు రెవెన్యూ గ్రామాల్లోని వక్ఫ్‌బోర్డుకు చెందిన పంట భూములు కొందరు నిబంధనలకు విరుద్ధంగా అన్యాక్రాంతం చేసుకుని బ్యాంకు రుణాలు తదితర లావాదేవీలు నిర్వహిస్తున్నారని సంబంధిత శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాధిక్ షేక్ కవిటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం కవిటి ఎస్ఐ కె.రాముకు వక్ఫ్ బోర్డు స్టేట్ సీఈఓ నుంచి అందించిన ఉత్తర్వుల్ని అందజేశారు. వక్ఫ్‌బోర్డు చట్టంలోని 52–ఏ నిబంధనల ప్రకారం మహ్మద్ అహ్మద్ ఆలీ, గొలియా మోహనరావు, బెందాళం నాగరాజు, మద్దిల భీమయ్య పేరిట వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములకు పట్టాదార్ పాసుపుస్తకాలు జారీచేసినట్లు తమ విచారణలో తేలిందని షేక్ తెలిపారు. వీటిపై ఇచ్ఛాపురంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో భారీగా పంట రుణాలు పొందినట్టు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై విచారణ జరపాలన్నారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్ ఉత్తీర్ణులకు కెరీర్ ప్రోగ్రాం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), హెచ్‌సీఎల్– టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో 'హెచ్‌సీఎల్ టెక్‌బీ' పేరిట కెరీర్ ప్రోగ్రాం అందిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాధికారి పీబీ సాయిశ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 27న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని మునసబ్‌పేటలో ఉన్న గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీలో జరిగే క్యాంపస్ డ్రైవ్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. వివరాలకు వెంకటరమణ (సెల్:6301045132), వేణుగోపాల్ (సెల్:8317652552) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సంఘటితంగా ఉంటేనే సమాజాభివృద్ధి

ఇచ్ఛాపురం: సమాజంలో ప్రతిఒక్కరూ సంఘటితంగా ఉంటేనే సమాజం బాగుపడుతుందని కృష్ణా జిల్లా గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి అన్నారు. ధర్మప్రచార పర్యటనలో భాగంగా గురువారం పురుషోత్తపురం పుష్పగిరిపై షిర్డిసాయిబాబా ఆలయం, బెల్లుపడ త్రినాథస్వామి ఆలయంలో మారుతి జ్యోతిర్విద్య గ్రంథాలయం అధ్యక్షులు తెన్నేటి తేజేశ్వరశర్మ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ మాతృభూమి, మాతృభాషను పరిరక్షించుకోవడం అందరి కర్తవ్యమన్నారు.

ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులు

- లంచాలు లేకుండా పనులు జరుగుతున్నాయి
- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి ధర్మాన



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: నాలుగేళ్లలో ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు జరిగాయని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం గార మండలం గొంటి పంచాయతీలో సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. అదే పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజా జీవితంలో అనూహ్య మార్పులు తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వ పనితీరు బాగుందని మీరంతా చెబుతున్నారని, అన్ని పంచాయతీల ప్రజలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. లంచాలు లేకుండా మీ పనులు జరుగుతున్నాయని, ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. సీఎం జగన్ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని చంద్రబాబు అంటున్నారని, అలాంటి వ్యక్తి మళ్లీ వస్తే మాయమాటలు చెప్పడం తప్పా ఏమీ జరగదన్నారు. ఈ సంక్షేమం, పథకాలు వద్దంటే చెప్పాలన్నారు. ఎయిర్‌పోర్టు కట్టడం, రోడ్డు వేయడం మాత్రమే అభివృద్ధి కాదని, ప్రతీ కుటుంబం నిశ్చింతంగా బతుకుతుండటం కూడా అభివృద్ధేనన్నారు. నాయీబ్రాహ్మణుల తోక కత్తిరిస్తామని చెప్పిన చంద్రబాబుకు వారి గురించి మాట్లాడే నైతికత లేదన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.కోటీ29 లక్షలతో టెండర్లు పిలిచామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు గొండు కష్ణమూర్తి, మాజీ సర్పంచ్ శిమ్మ ధర్మరాజు, ఎంపీటీసీ కోట రామారావు, పీస గోపి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో చార్జిషీటు దాఖలు చేయాలి



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్ : నేరానికి సంబంధించి చార్జిషీటును కోర్టులో సకాలంలో దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధికను శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీని కలిసినవారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావుతో, అసోసియేషన్ కార్యదర్శి పి.రాము, ఉపాధ్యక్షుడు జి.చంద్రమోహన్, లైబ్రరీ సెక్రటరీ భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స



కుటుంబ సభ్యులకు కిట్ అందజేస్తున్న వైద్యబృందం

శ్రీకాకుళం రూరల్: జిల్లావాసులకు అత్యున్నత వైద్య సేవలు అందిస్తున్న రాగోలు జెమ్స్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స కాక్లియర్ ఇంప్లాంట్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం జెమ్స్‌లో నిర్వహించిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే మూగ, చెవుడు చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స అందిస్తారని చెప్పారు. దీనిలో భాగంగానే విశాఖ జిల్లాకు చెందిన వెంకన్నపాలెంకు చెందిన సురేష్, సంతోషి దంపతుల రెండేళ్ల కుమారుడు షణ్ముఖ్, కోష్టకు చెందిన సతీష్, రోహిణి దంపతుల కుమార్తె మూడేళ్ల దీక్షితలకు జెమ్స్ వైద్య బృందం డాక్టర్ తాతారావు, జనార్దన్, కృష్ణకిషోర్‌లు శస్త్రచికిత్స విజయవంతం చేసినట్లు వివరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కూడా చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుధీర్, శ్రీనివాసులు, మెడికల్ సూపరింటెండెంట్ బాలమురళి, ప్రవీణ్ పాల్గున్నారు.

యుద్ధ ప్రాతిపదికన స్తంభాల పునరుద్ధరణ



తురకపేట వద్ద విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం వీచిన ఈదురు గాలుల కారణంగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. గురువారం ఉదయానికే మండలానికి చేరుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది కార్మికులతో కలిసి స్తంభాలు ఏర్పాటు, వైర్లు సరిచేసే పనులు చేపట్టినట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. తురకపేటలో సుమారు పది స్తంభాలు నేలకొరిగాయని చెప్పారు. బాలేరు, కొత్తపేట, తురకపేట, కృష్ణాపురం, కవిటి, చొర్లంగి, దబ్బపాడు, సిద్ధాంతం తదితర గ్రామాల్లో స్తంభాలను పునరుద్ధరించామని తెలిపారు.

● పాతపట్నంలో ఆధ్యాత్మిక శోభ



ఆకట్టుకున్న రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం శాస్త్రీయ నృత్యప్రదర్శన



ఆది శేషుడిపై బాలకృష్ణుడు



నందిపై శివుడు

పాతపట్నం నీలమణిదుర్గ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మొత్తం 70 వీధుల్లో పురాణ ఇతిహాసాల్లోని కీలక ఘట్టాలను విగ్రహాల రూపంలో ఏర్పాటు చేశారు. వీటిని చూసేందుకు భారీగా భక్తులు తరలివస్తున్నారు.

–పాతపట్నం



వరాహ నరసింహావతారం